క్లుప్తంగా

బీవీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా మదన్‌మోహన్‌రెడ్డి



మునగాల: భారత వికలాంగుల హక్కుల పోరాట సమితి (బీవీహెచ్‌పీఎస్) మునగాల మండల శాఖ అధ్యక్షుడిగా తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గోపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ తనకు నియామకపత్రం అందచేసినట్లు మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు. త్వరలో మండలంలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తానని తెలిపారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

హుజూర్‌నగర్‌రూరల్ : శివగురు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ దేశగాని సాంబశివగౌడ్ తన తండ్రి తృతీయ వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని బూరుగడ్డలో వృద్ధులకు చీరలు, పట్టు పంచెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొల్లగాని నాగమణి, బొల్లగాని సుబ్బుగౌడ్, మంద రవి, రమణ, వినయ్, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ బాబునాయక్

గరిడేపల్లి : మండలంలోని గారకుంటతండాలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఆ గ్రామ సర్పంచ్ గుగులోతు బాబునాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన దివంగత హచ్చునాయక్ జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన 9గుంటల స్థలంలో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు సైదానాయక్, రవినాయక్, కామకోటినాయక్, పాపిరెడ్డి, సైదులు, సందీప్‌నాయక్, బాలునాయక్, రమేష్‌నాయక్, సుధాకర్ నాయక్, హేమ్లానాయక్ తదితరులున్నారు.

మహాలక్ష్మి ఆలయ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని తొగర్రాయి శివారులో గల మహాలక్ష్మి అమ్మవారి ఆలయ నూతన కమిటీని సర్పంచ్ దొంగల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాదా గురునాథం, ఉపాధ్యక్షుడిగా బాలేబోయిన వెంకయ్య, కోశాధికారిగా యాదా ఉపేందర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతుగా కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శివాలయ కమిటీ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు, పూసపాటి రామారావు, బాలేబోయిన వేలాద్రి, అమరబోయిన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ



విద్యార్థులతో దాత అజయ్, ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్ దిన్న గ్రామానికి చెందిన యడవల్లి అజయ్ తన తండ్రి శ్రీనివాస్ జ్ఞాపకార్థంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాఘవారెడ్డి, ఉపాధ్యాయులు హుస్సేన్, అరుణ్, నరేష్, రాహుల్, సందీప్, రఘు తదితరులున్నారు.

కళాకారుడికి అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న పిచ్చయ్య

మఠంపల్లి: మండల కేంద్రానికి చెందిన రంగస్థల కళాకారుడు గుంటిపిచ్చయ్యకు సినీనటుడు జయప్రకాష్‌రెడ్డి స్మారక అవార్డు దక్కింది. సోమవారం హైదరాబాదులో యామిని స్టూడియోస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శాసనమండలి ఉపసభాపతి బండప్రకాష్, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి పిచ్చయ్యకు అవార్డు అందజేశారు. కళారంగానికి అందిస్తున్న విశిష్ట సేవలకుగాను అవార్డు దక్కినట్లు పిచ్చయ్య తెలిపారు.

డీజేలతో హడల్!

- కోదాడ పట్టణంలో డీజే సౌండ్‌బాక్స్‌లతో నిత్యం ర్యాలీలు
- నిషేధం ఉన్నా పట్టించుకోని పోలీసు అధికారులు



కోదాడలో వాహనంపై ఏర్పాటు చేసిన డీజే బాక్స్‌లు

కోదాడ: కోదాడలో కొంత కాలంగా గుండెలు పగిలేలా, చెవులకు చిల్లులు పడేలా డీజేల మోతతో పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీలు సాగిస్తున్నారు. సందర్భం ఏదైనా హోరెత్తించే శబ్దంతో లెక్కకు మించిన డీజే బాక్సులతో పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ముందు నుంచే ర్యాలీలు నిర్వహిస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వం నిషేధించినా..

శబ్ద కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం డీజేలను నిషేధించింది. వివిధ కార్యక్రమాలకు కేవలం మైక్‌లను మాత్రమే పరిమిత శబ్దంతో వాడాలి. దీనికి కూడా పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ డీజేలను వాడితే కేసులు నమోదు చేయాలి. కానీ కోదాడలో కొంతకాలంగా వాహనంపై 10కి మించి డీజే సౌండ్‌బాక్స్‌లను అమర్చి భయంకర శబ్దాలతో ప్రధాన రోడ్డుపై ప్రజలను, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తమ స్టేటస్‌ను ప్రదర్శించుకోవడానికి కొందరు ఈ డీజేలను పెట్టి కార్యక్రమాలు నిర్వహించడం పరిపాటిగా మారింది.

నిత్యం పోలీస్‌స్టేషన్ ముందు నుంచే..

కోదాడ పట్టణంలో ప్రధాన రహదారిపై నిత్యం విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. ఈ రహదారిలోనే పట్టణ పోలీస్‌స్టేషన్, డీఎస్పీ కార్యాలయం, రూరల్ పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ స్టేషన్లు ఉన్నాయి. గతంలో డీజే బాక్స్‌లను వివాహాది శుభకార్యాలకు వాడేవారు. కానీ ఇప్పుడు చావులకు, పుట్టిన రోజు వేడుకలు, రాజకీయ పార్టీల నేతల ర్యాలీలు, ఇలా ప్రతి దానికి డీజే వాడుతున్నారు. వాహనానికి డీజే బాక్సులు అమర్చి పెద్ద శబ్దంతో ఈ రహదారి గుండా వెళ్తూ వాహనదారులను ఇబ్బంది పెడుతున్నా ఇదేంటని ప్రశ్నించే వారు కరువయ్యారు. ఇదిలా ఉండగా.. కొద్దిరోజుల్లో వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ జాఢ్యం మరింత ఎక్కువ కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వాహన సైలెన్సర్లు తీసి రహదారిపై హల్‌చల్..

డీజేల మాట ఇలా ఉండగా కోదాడ పట్టణంలో కొంత మంది నిర్వహిస్తున్న ర్యాలీల్లో యువకులు తమ ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తీసి భీకరమైన శబ్దంతో హల్‌చల్ చేస్తున్నారు. ఈ విష సంస్కృతి నుంచి పట్టణ ప్రజలను కాపాడడానికి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు పేర్కొంటున్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

పట్టణంలో ర్యాలీలు తీసే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలను వాడకూడదు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు. త్వరలో డీజే నిర్వాహకులను పిలిపించి మాట్లాడుతాం. మోటార్ సైకిళ్ల ర్యాలీల్లో వాహనాలకు సైలెన్సర్లు తీసేసే వారిని, అధిక స్పీడ్‌తో నడిపేవారిని అదుపులోకి తీసుకుంటున్నాం.

– రాము, కోదాడ పట్టణ సీఐ

చింతలపాలెంలో వనభోజనాలు



వనభోజనాలకు వెళ్తున్న చింతలపాలెం గ్రామస్తులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలో సోమవారం వనభోజనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సీపీఐ, కాంగ్రెస్ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ప్రజలు, మహిళలు కలిసి ఊరేగింపుగా గంపలలో వంట, ఇతర సామగ్రిని సర్దుకుని గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. కుటుంబ సభ్యులతో కలిసి వంటావార్పు చేసుకుని వనంలోనే భోజనాలు ఆరగించారు.

గ్రంథాలయాలు పఠనాసక్తికి దోహదం

మోతె : గ్రంథాలయాలు పఠనాసక్తికి దోహదపడతాయని మోతె సర్పంచ్ మెట్టు అలివేలు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన అస్థిత్వ ఎన్‌జీఓ సహకారంతో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన గ్రంథాలయ పుస్తకాలను సోమవారం ఆమె చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పగడాల విద్యావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ తిర్మలరెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, సరిత పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి బీఆర్‌ఎస్‌లో చేరికలు

- కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

అనంతగిరి: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చనుపల్లి గ్రామానికి చెందిన నల్లా భూపాల్‌రెడ్డితోపాటు మరో వంద కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పరిపాలన కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పార్టీలు ముఖ్యం కాదని, అభివృద్ధి, సంక్షేమాన్ని చూడాలన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌పార్టీ అధికారంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గింజుపల్లి రమేష్, ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు, వెంపటి వెంకటేశ్వరరావు, మధుసూదన్, శ్రీనివాస్ గౌడ్, యాకోబ్, భిక్షం, వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాగిరెడ్డి, మట్టపల్లి సైదులు, ధన్వంతరెడ్డి, సైదులు పాల్గొన్నారు.

ఉత్తమ్ పోటీలో ఉంటే నా గెలుపు సునాయసం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

పాలకవీడు: ఉత్తమ్ పోటీలో ఉంటే తాను సునాయాసంగా గెలవడం ఖాయమని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. పాలకవీడు మండలంలోని అలింగాపురం గ్రామ ఎస్సీ కాలనీలో కొత్త వీరారెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు సీసీ, డ్రెయినేజీ పనులను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత సైదిరెడ్డి, అభివృద్ధి నిరోధకుడి మధ్య పోటీ ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ నాలుగేళ్ల హయాంలో నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. పదిహేను రోజుల తర్వాత ఉత్తమ్ ఏ పార్టీలో ఉంటారో కూడా తెలియని పరిస్థితి అన్నారు. అభివృద్ధి సంక్షేమాలపై ప్రతీ గ్రామంలో చర్చలు జరపాలన్నారు. గతంలో పాలన ఎలా ఉందో సీఎం కేసీఆర్ పాలన ఎలా ఉందో చర్చించుకోవాలన్నారు. మళ్లీ కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్త లక్ష్మమ్మ, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు మలిమంటి దర్గారావు, పీఏసీఎస్ చైర్మన్ యరడ్ల సత్యనారాయణరెడ్డి, వీరారెడ్డి, భూక్యా రవినాయక్, పసుపులేటి సైదులు, తీగల శేషురెడ్డి, నరినాయక్, రామారావు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో శ్రీలక్ష్మీనృసింహుడి నిత్య కల్యాణం



ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా శ్రీలక్ష్మీ స్వామీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ ,మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపం నిర్మాణానికి మట్టి సేకరణ



మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

నేరేడుచర్ల : దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల స్మారకార్థంగా స్థూపం నిర్మాణానికి ఆజాద్ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మట్టి సేకరిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు పార్తన బోయిన విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమృత్ కలశంలో మట్టి సేకరించి మాట్లాడారు. వీరులకు వందన సమర్పణ భావంతో ఢిల్లీలో స్థూపం నిర్మాణానికి మట్టి సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బైరెడ్డి బక్కిరెడ్డి, పల్లెపంగ వీరబాబు, లెనిన్, పవన్, సతీష్, ప్రవీణ్, నరేష్, అనిల్ ఉన్నారు.

దుబ్బాక సంజీవరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

నాగారం : సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కమిటీ నాయకుడు, ప్రతిఘటన పోరాట యోధుడు దుబ్బాక సంజీవరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సంపెట కాశయ్య అన్నారు. దుబ్బాక సంజీవరెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా సోమవారం మండల పరిధిలోని పసునూర్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సంజీవరెడ్డి స్మారకస్థూపం వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక కరుణాకర్‌రెడ్డి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు కునుకుంట్ల సైదులు, అరుణోదయ రాష్ట్ర నాయకులు తడకమళ్ల సంజీవ, బయ్యం లింగయ్య, ఎనగందు ముత్తయ్య, కడారి సైదులు, నాతి ఉప్పలయ్య, బొడ్డు వీరయ్య, షేక్ ఖాసీం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్ధీకరించాలి

అర్వపల్లి : సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)లో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం నాయకుడు, సీఆర్పీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామిడి వెంకట్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్ఎస్ఏలో పని చేసే కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, ఆలోపు కేడర్లను బట్టి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఆయన వెంట సీఆర్పీ జానయ్య, కొండల్, కవిత ఉన్నారు.

వైభవంగా సాగుతున్న ముత్యాలమ్మ జాతర



విద్యుత్ ప్రభలను ప్రారంభించిన ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, మల్లయ్య యాదవ్



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



బోనాలతో మహిళలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ప్రతి ఏటా శ్రావణ మాసంలో నిర్వహించే ముత్యాలమ్మ జాతర వైభవంగా కొనసాగుతోంది. జాతరలో రెండవ రోజైన సోమవారం పట్టణంలోని మూడు ఆలయాల్లో ఉన్న ముత్యాలమ్మ, అంకమ్మ అమ్మవార్లను పూజారులు పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు మేకలు, కోళ్లను బలి ఇచ్చి సాంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై అలంకరించిన ప్రభలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. ఇదిలాఉండగా ఆదివారం రాత్రి విద్యుత్ లతలతో ఏర్పాటు చేసిన ప్రభలను ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్‌లు ప్రారంభించి ఊరేగింపు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ పండుగ



ప్రభను అలంకరించిన ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే

హుజూర్‌నగర్‌రూరల్ : సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని లక్కవరంలో నిర్వహించిన ముత్యాలమ్మ పండుగలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాట్లాడారు. గ్రామ దేవతలను ఆరాధించడం తెలంగాణ ప్రజల ఆచారాల్లో ప్రధానమైన అంశమన్నారు. ప్రజలపై గ్రామ దేవతలు కరుణ చూపాలని, పాడి, పంటలు సమృద్ధిగా పండాలని కోరారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ప్రభ బండిని అయన నడిపించి భక్తులను ఉత్సాహపరిచారు. అనంతరం ఎమ్మెల్యే సైదిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, సర్పంచ్ గుండెపంగు సౌజన్యనరేష్, ఎంపీటీసీ రణపంగు కాశమ్మ, మాజీ సర్పంచ్ చామకూరి గురుపాదం, రామనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని అశోక్‌నగర్‌లో గల మానసిక దివ్యాంగుల కేంద్రంలో ఎన్ఆర్ఐ పగడాల సుమంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన తల్లిదండ్రులు న్యాయవాది రామచంద్రారెడ్డి, స్వాతి సోమవారం కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు కట్టెబోయిన జ్యోతి శ్రీనివాస్‌యాదవ్, పెండెం వెంకటేశ్వర్లు, రామినేని సత్యనారాయణ, పగడాల చంద్రారెడ్డి, ఇర్ల సాగర్ రెడ్డి, దేశబోయిన సత్యనారాయణ ఉన్నారు.

యూరియా కొరత లేదు

మేళ్లచెరువు : యూరియా కొరత లేదని, రైతులకు సరిపడా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి పెద్ది శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన విలేకరుతో మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా యూరియా వాడకం పెరిగిందన్నారు. దీంతో వాడాల్సిన మోతాదుకన్నా యూరియా ఎక్కువ వాడడంతో కొరత ఏర్పడిందన్నారు. మూడు రోజులుగా మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘాల నందు యూరియా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. పంటల్లో మోతాదుకు మించి యూరియా వాడడంతో ఇతర తెగుళ్లు ఆశిస్తాయని పేర్కొన్నారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో ఆశావర్కర్లు

మునగాల: హైదరాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయం ముట్టడికి తరలివెళ్తున్న ఆశా వర్కర్లను సోమవారం పోలీసులు మండల కేంద్రంలో అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కుందూరు అనిత, బెజవాడ జ్యోతి, గుడిపూడి భాగ్యలక్ష్మి, జ్యోతి ఉన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శాంతకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు మాదిగలు సిద్ధం కావాలి



కోదాడ : శిబిరం వద్ద మాట్లాడుతున్న ముత్యాలు



చిలుకూరు : నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

కోదాడరూరల్ : ఎస్సీ వర్గీకరణ సాధనకు మాదిగలు సిద్ధం కావాలని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి ముత్యాలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ లేనికారణంగా మాదిగ, ఉపకులాలకు రిజర్వేషన్లు అందక నష్టపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు రాజుమాదిగ, దుద్దెల లింగారావు, నాగభూషి, సుధాకర్, రత్నయ్య, కృష్ణయ్య ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

చిలుకూరు: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి కోటేష్ మాదిగ, మల్లెపంగు సూరిబాబు, సిద్దెల శ్రీను, వడ్డేపల్లి రామకృష్ణ, లచ్చయ్య, బాలు, వీరబాబు, సైదులు, సిద్దు, చిరంజీవి పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడు రాంరెడ్డికి సన్మానం



రాంరెడ్డిని సన్మానిస్తున్న గిరిజన నాయకులు

హుజూర్‌నగర్ : టీటీడీ బోర్డు సభ్యుడిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డిని సోమవారం గిరిజన నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువ, పూలమాల, గిరిజన తలపాగాతో సాంప్రదాయ వేషధారణలో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జగన్ నాయక్, ఎంపీపీ పార్వతి కొండా నాయక్, అడ్వకేట్ నగేష్ రాథోడ్, డాక్టర్లు జిలేంద్రుడు, వెంకటేశ్వర్లు, నాయకులు వెంకటేశ్వర్లు, ఎం భీముడు, బి.నాగరాజు నాయక్, రామారావు నాయక్, నవీన్ నాయక్, రవీందర్ నాయక్, ఉపాధ్యాయులు వెంకటరామ్ నాయక్, హరి పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ ప్రకాష్

కోదాడరూరల్ : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు యూనియన్ బ్యాంకు ఎల్లప్పుడు ముందుటుందని ఆ బ్యాంక్ జోనల్ హెడ్, చీఫ్ మేనేజర్ కారే భాస్కర్‌రావు, జనరల్ మేనేజర్ ఎం. రంవీంద్రబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌ను హుజూర్‌నగర్‌రోడ్‌లో నూతన కార్యాలయంలోకి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. డీఎస్పీ ప్రకాష్, డాక్టర్ సుబ్బారావులు బ్యాంకును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఎం హనుమంతరెడ్డి, సీఐ రాము, బ్రాంచ్ మేనేజర్ సౌజన్య, ప్రకాష్‌బాబు, సుందరకష్ణ, జేవీరావు, మేనేజర్‌లు ఉన్నారు.

రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కేసీఆర్‌దే



రుణమాఫీ పత్రాలను అందజేస్తున్న సైదులు

తుంగతుర్తి : రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సొసైటీలో రైతులకు రుణమాఫీ పత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. సొసైటీ పరిధిలో 517 మంది రైతులకు గాను రూ.1.68కోట్ల రుణమాఫీ పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగతా 252 మంది రైతులకు త్వరలోనే రుణమాఫీ పత్రాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతులకు నూతన రుణాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు యాదగిరి, రవీందర్‌రెడ్డి, సీతఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టును భర్తీ చేయాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐదారేళ్ల నుంచి ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టును భర్తీ చేయాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు కేసాని రాహుల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సోమవారం మండల అధికారులకు వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ ఒక్కరే ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.